

మూసాపేటలో ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్న మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

ఇక్కడ ఉండే వారు తెలంగాణ బిడ్డలే..

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మూసాపేటకు చెందిన యువకులు



కూకట్‌పల్లి:కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లు బుధవారం మూసాపేటలో ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. మూసాపేట ఇందిరా గాంధీ విగ్రహం నుంచి జనతానగర్, యాదవబస్తీ, గూడ్స్‌షెడ్ రోడ్డు, భరత్‌నగర్, అవంతినగర్ తోట, బబ్బు గూడ ప్రాంతాల మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ పదేళ్ల కాలంలో హైదరాబాద్ మహానగరాన్ని శాంతి భద్రతలకు మారు పేరుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు అందుబాటులో ఉండి ఏ లోటు లేకుండా ప్రజలను చూసుకుంటున్నామని తెలిపారు. మూసాపేటలో ఎక్కువగా ఉండే శ్రీకాకుళం, ఒరిస్సా ప్రాంత ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో సుఖసంతోషాలతో ఉంటున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మూసాపేట యువకులు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మూసాపేట నుంచి 50 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.





మూసాపేట డివిజన్‌లో జరిగిన ప్రచారంలో మాధవరం కృష్ణారావుకు దట్టీ కడుతున్న చున్నూ పాషా

బీఆర్‌ఎస్‌లోకి మేడ్చల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు పృథ్వీ



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పృథ్వీ

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు పృథ్వీ బీజేపీ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సతీష్ అరోరా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి కేటీఆర్ పృథ్వీకి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ.. బీజేపీ పార్టీలో ఉన్న వారికి పార్టీ టికెట్ ఇవ్వకుండా జనసేన పార్టీకి టికెట్ అమ్ముకుందన్నారు. కూకట్‌పల్లిలో స్థానికంగా ఉంటూ మాధవరం కృష్ణారావు అన్ని విధాలుగా కూకట్‌పల్లిని అభివృద్ధి చేశారని తెలిపారు.

అంజయ్యనగర్‌లో ముమ్మర ప్రచారం..

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్, జయశంకర్‌నగర్ ప్రాంతాలలో బీఆర్‌ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచుతూ కారు గుర్తుకు ఓటు వేసి మాధవరం కృష్ణారావును గెలిపించాలని ప్రజలను కోరారు. 10 ఏళ్లుగా ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియ జేస్తూ పిలిస్తే పలికే అన్నగా మనకు అండగా ఉంటున్న మాధవరం కృష్ణారావుకు ఓటు మన జీవితాలకు మలుపు అని ఓటర్లుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బల్‌రాజు, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మట్టి శ్రీను, మక్కాల సత్యనారయణ, రాజుగౌడ్, కవిత, కనకరాజు, పోచయ్య, శ్రీశైలం చారి తదితరులు పాల్గొన్నారు.



అంజయ్యనగర్, జయశంకర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయం

కూకట్‌పల్లి నియోజకవర్గ అభ్యర్థి బండి రమేష్



మోతీనగర్‌లో బండి రమేష్‌తో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన సతీమణి లకుమాదేవి

కూకట్‌పల్లి: అక్కడక్కడ నాలుగు సిమెంట్ రోడ్లు వేసి అదే గొప్ప అభివృద్ధిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పుకోవటం విడ్డూరంగా ఉందని కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజులోని రమ్యా గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కేపీహెచ్‌బీ కాలనీ పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో బండి రమేష్ సమక్షంలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ పట్ల పెరుగుతున్న ప్రజాదరణను గమనిస్తే ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో అధికార మార్పిడి జరగాలనే బలమైన ఆకాంక్ష ప్రజల్లో పెల్లుబుకుతోందని వ్యాఖ్యానించారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నగర ప్రజలకు 24గంటలు విద్యుత్ సరఫరా, పుష్కలంగా మంచినీటి సరఫరా చేస్తున్నామంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందన్నారు. నగరంలో కొన్ని వారాలుగా విద్యుత్ సరఫరాలో కోత పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జ్ డా. సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బండి రమేష్ సతీమణి లకుమాదేవి ఎన్నికల ప్రచారం...

మూసాపేట డివిజన్ మోతీనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ ఆయన సతీమణి లకుమాదేవి రోడ్ షోలో పాల్గొన్నారు. బండి రమేష్ గెలుపే లక్ష్యంగా సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అందేలా పక్కా ప్రణాళికతో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ ప్రజలే మా బలగం కార్యకర్తలే మా బలం అని పేర్కొన్నారు. మనకు మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలన్నారు.

అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాం

ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్ మహానగరంను కోట్లాది రూపాయలు వెచ్చించి అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దామని కేటీఆర్ అన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్‌యస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలన్నా, మరిన్ని పథకాలు రావాలన్నా సీఎం కేసీఆర్‌కే సాధ్యమన్నారు.బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌యస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలంటూ కేటీఆర్ రోడ్డు షో నిర్వహించారు. కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్,శ్రీనివాసరావు,మాధవరం రోజాదేవి రంగారావు, జూపల్లి సత్యనారాయణ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో బుధవారం సాయంత్రం మంత్రి కేటీఆర్ రోడ్ షోతో పాటు కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. కాలనీ మొత్తం గులాబీమయంగా మారింది. డీజే, నాయకులు, కార్యకర్తలు డ్యాన్సులతో హోరెత్తించారు. కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్ పటేల్, డివిజన్ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. డివిజన్ నాయకులు దాత్రీ గౌడ్ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో హ్యాట్రిక్ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఫ్లకార్డులు ఆకట్టుకున్నాయి.

పార్టీ కార్యాలయం ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: హెచ్‌యంటి శాతవాహననగర్‌లో బుధవారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బీఆర్‌యస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌యస్ పార్టీ విజయం కోసం సమిష్టిగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఓటేసిన వృద్ధులు, దివ్యాంగులు



ఓటు వినియోగించుకుంటున్న, ఓటు వేస్తున్న వికలాంగురాలు



ఓటు వేసినట్లు వేలికి సిరా చూపుతున్న దివ్యాంగులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో వయోవృద్ధులు, మానసిక వికలాంగులు, వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో మొదలైంది. పోస్టల్ బ్యాలెట్ కోసం ముందుగా తమ పేర్లను నమోదు చేసుకున్న వారికి ఇంటివద్దకే సిబ్బంది వచ్చి ఓటింగ్ చేయించుకుంటున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అబ్రహర్‌నగర్, దుబాయిగేట్, హస్మత్‌పేట ప్రాంతాలలో పేర్లు నమోదు చేసుకున్న వారి ఇంటికి వచ్చిన బిఎల్‌ఓ సురేఖ బృందం వారితో ఓటు వెయించారు.

కారులో తరలిస్తున్న రూ.15 లక్షలు సీజ్

బాలానగర్: బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా నగదు పట్టుబడింది. బుధవారం సరైన పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.15లక్షలను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఎం. సాయిబాబు పేరుతో ఉన్న కారు (ఏపీ 09సీటీ6899)ను ఐడీపీఎల్, డీమార్టు వద్ద ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



గొట్టిముక్కల వెంగళరావు సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో భారీగా చేరిన యువకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి గొట్టిముక్కల వెంగళరావు సమక్షంలో ఆయన నివాసంలో బుధవారం ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, సాయినగర్ నుంచి 500 మంది యువకులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలో నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గొట్టిముక్కల వెంగళరావు, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆదిత్యారావులు కండువాలు కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా గొట్టిముక్కల వెంగళరావు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారని తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకిది చెంపపెట్టు లాంటిదిని అన్నారు. రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నుంచి అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావులు భారీ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డా. గొట్టిముక్కల విశ్వతేజేశ్వరరావు, జనార్దన్, వెంకట్, విష్ణు, విజయ్, అంజి, శేఖర్, చింటు, నరహరి, మహేష్, పవన్, భాస్కర్, ఆదిత్య, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే.. ప్రజాసేవ చేస్తా..

శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోజురోజుకి బీజేపీకి మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం వివేకానందనగర్ డివిజన్‌లో యాదగిరి ఆధ్వర్యంలో కమల ప్రసన్ననగర్, వెంకటేశ్వరనగర్, బాగ్ అమీర్ నుంచి యువకులు, మహిళలు పార్టీలో చేరారు. వారికి కాషాయ కండువా కప్పి బీజేపీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌యస్ పార్టీల ద్వంద్వ వైఖరి ప్రజలకు అర్థమైందని ఈసారి బీజేపీకి పట్టం కట్టడానికి ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బీజేవైఎం నాయకులు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్, మాధవరావునగర్, ఆల్విన్ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ గెలుపే లక్ష్యంగా బుధవారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఉప్పల విద్యాకల్పన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఎన్నికల ప్రక్రియ అంతా పారదర్శకం



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా:ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్(ఢిల్లీ)తో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎం యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ పలు సూచనలు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో శాసన సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు(ఎపిక్)లను పోస్టల్ శాఖ ద్వారా నేరుగా ఓటర్లకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని, కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నారని తెలిపారు.

ఓట్ ఫ్రమ్ హోమ్‌కు ఏర్పాట్లు

జిల్లాలో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు మొత్తం 1070 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామన్నారు. ఇళ్ల వద్ద నుంచి వారి ఓటును స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని గౌతమ్ తెలిపారు. ఈ బృందాలు ఓట్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియ చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామని, ఈసీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యతతో ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ తరగతులతో పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. శిక్షణ కేంద్రాల వద్దే ఫెసిలిటేషన్ సెంటర్‌లను నెలకొల్పి పోలింగ్ విధుల్లో నియమించబడిన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులతో సహా ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ.. గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పి పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు కృష్ణారెడ్డి, దేవసహాయం, విజయకుమారి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

మీ అందరి వాడిని.. ఒక్క అవకాశం ఇవ్వండి

ముమ్మారెడ్డి ప్రేమకుమార్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని శేషాద్రినగర్, కూకట్‌పల్లి గ్రామం, వెంకటరావు నగర్, సంగీత్‌నగర్, దయార్‌గూడలో బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గాజుగ్లాసుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో 10 సంవత్సరాల్లో ఎక్కడ చూసినా భూకబ్జాలు జరిగాయని అన్నారు. ఈ ఎమ్మెల్యే భూ ఆక్రమణల గురించి ప్రజలందరికీ తెలుసన్నారు. పేద వారికి ఇల్లు ఇవ్వకుండా, తన సొంత వర్గానికి మంజూరు చేయించుకోవటంపై తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనం అన్నారు.

◆ ఇటువంటి అవినీతి ఎమ్మెల్యే ఉంటే రానున్న రోజుల్లో సామాన్యుడు జీవించే పరిస్థితి ఇక్కడ ఉండదని చెప్పారు. నిత్యం ప్రజా జీవితంలో ఉండే వ్యక్తిని, అ అందరి మనిషిని, మీ వాడిని ఈసారి మీరందరూ కలిసి ఒక అవకాశం కల్పించాలని కోరారు. గాజుగ్లాసు గుర్తును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, శ్రీకర్‌రావు, ఎస్ సూర్య ప్రకాష్‌రావు, ఎ.సూర్యరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, పవన్‌సాయి, ధర్మారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నెక్సస్ మాల్‌లో బ్లాక్ ఫ్రై డే సేల్



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని నెక్సస్‌మాల్ బ్లాక్ ఫ్రైడే సేల్‌ను బుధవారం ప్రకటించింది. నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు ఆఫర్‌లు, డీల్‌లతో వినియోగదారులను సంతృప్తి పరచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నెక్సస్ మాల్ తాజా ట్రెండ్‌లను కొనసాగిస్తూ.. ఉత్తేజకరమైన ఈవెంట్‌లు, యాక్టివేషన్‌లతో షాపింగ్ చేసే వారు తిరిగి వచ్చే విధంగా ఈ ఆఫర్‌లు ప్రకటించినట్లు తెలిపారు.

◆ ఈ బ్లాక్ ఫ్రైడే సేల్ సమయంలో 50 ప్లస్ బ్రాండ్‌లు పరిమిత కాలానికి 70శాతం తగ్గింపును అందజేస్తున్నాయన్నారు. రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు షాపింగ్ చేసిన వారికి డబుల్ బెడ్ షీట్‌లు, జాక్ అండ్ జోన్స్ డఫిల్ బ్యాగ్‌లు, 3పీసెస్ నాన్‌స్టిక్ వంట సామాను పొందవచ్చన్నారు. 1 లక్షా 50 వేల ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్ కొనుగోలుపై 5 గ్రాముల వెండి నాణెం పొందవచ్చన్నారు. అదే విధంగా గిఫ్ట్ ఓచర్‌ల ద్వారా 25 శాతం క్యాష్ బ్యాక్‌ని ఆస్వాదించవచ్చన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

హిమాయత్‌నగర్: తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఫుట్ ఓవర్ బ్రిడ్జీ సెక్యూరిటీ సిబ్బంది సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. హిమాయత్‌నగర్ లిబర్టీలోని స్టాంజా బిల్డింగ్‌లోని చింతామణి పరస్వనాథ్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ కార్యాలయం ముందు బుధవారం బాధిత సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన చేపట్టారు. మల్లేష్, రాజు, మధు, శ్రీకాంత్, రాము, మహేష్ పాల్గొన్నారు.